## క్లుప్తంగా

### నేటి నుంచి పవిత్రోత్సవాలు

**సఖినేటిపల్లి:** అంతర్వేది లక్ష్మీనృసింహుని సన్నిధిలో ఈ నెల 23 నుంచి 26వ తేదీ వరకూ నాలుగు రోజుల పాటు స్వామి వారి పవిత్రోత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు అర్చకులు శుక్రవారం ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ మేరకు ఇందుకు సంబంధించిన పవిత్రాలను అహోబిలం లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం నుంచి ఆలయ ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్ ఆధ్వర్యాన వేదపండితులు, అర్చకులు ఇప్పటికే అంతర్వేదికి తీసుకువచ్చారు. కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఏసీ వి.సత్యనారాయణ కోరారు.

### విఘ్నేశ్వరునికి పంచహారతులు

**అయినవిల్లి:** చవితి మహోత్సవాల్లో భాగంగా అయినవిల్లి విఘ్నేశ్వర స్వామికి వేదపండితుల ఆధ్వర్యంలో కనుల వైకుంఠంగా పంచహారతులు ఇచ్చారు. ఈ కార్యక్రమాన్ని వీక్షించేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. శుక్రవారం స్వామికి ఆలయ ప్రధానార్చకులు అయినవిల్లి సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో స్వామికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని మాఢవీధుల్లో మూషిక వాహనంపై ఉంచి ఊరేగించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించారు.

### స్త్రీ నిధి నిధుల చెల్లింపు జాప్యంపై విచారణ

**ఆలమూరు:** మండలంలోని కలవచర్లలో వెలుగు శాఖకు సంబంధించి స్త్రీనిధి నిధి చెల్లింపుల జాప్యంపై శుక్రవారం విచారణ జరిగింది. జిల్లా స్త్రీనిధి మేనేజర్ ఎం.నరసింహ ఆధ్వర్యంలో వెలుగు అధికారుల బృందం గ్రామంలో పర్యటించి స్త్రీనిధి ఖాతాదారుల జాబితాను పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న బకాయిలను నెలాఖరులోపు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఏపీఎం ధనరాజును ఆదేశించారు. వసూలు చేయని పక్షంలో సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు. మండల మహిళ సమాఖ్య అధ్యక్షురాలు జి.ఉమాశ్రీ, సీసీ కె.భీమరాజు, యానిమేటర్ వి.జ్యోతి పాల్గొన్నారు.

### మహిళా బిల్లు చారిత్రాత్మకం

**కొత్తపేట:** మహిళా బిల్లు ఆమోదం ప్రధాని మోదీ సారథ్యంలో కేంద్ర కేబినెట్ తీసుకున్న చారిత్రక నిర్ణయమని బీజేపీ స్వచ్ఛభారత్ రాష్ట్ర కన్వీనర్ పాలూరి సత్యానందం శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మూడు దశాబ్దాలుగా అమలుకు నోచుకోని మహిళా రిజర్వేషన్ బిల్లుకు మోదీ సారథ్యంలో అన్ని పార్టీలు సానుకూలంగా ఉన్న నేపథ్యంలో ఈ ప్రత్యేక పార్లమెంట్ సమావేశంలో బిల్లు ప్రవేశపెట్టి ఆమోదం పొందేలా కృషి చేశారని పేర్కొన్నారు. ఈ బిల్లు ప్రకారం లోక్‌సభలో, రాష్ట్రాల అసెంబ్లీలో మూడోవంతు సీట్లు మహిళలకు దక్కుతాయన్నారు. ఈ విధంగా నరేంద్రమోదీ మహిళా సాధికారత సాధించే దిశగా చారిత్రక నిర్ణయం తీసుకున్నారన్నారు.

### కాచి చల్లార్చిన నీటిని తాగండి

**అంబాజీపేట:** ప్రస్తుత వాతావరణంలో విషజ్వరాల బారిన పడుతున్నారని ప్రజలంతా అప్రమత్తంగా ఉంటూ కాచి చల్లార్చిన నీటిని తాగాలని అంబాజీపేట వైద్యాధికారి కేఎస్ శ్రీనివాస్ అన్నారు. ఇసుకపూడి శివారు తురకలదొడ్డిలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. సుమారు 50 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం ఇంటి వద్ద ఉన్న రోగులను పరీక్షించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ బి.అప్పారావు, ఏఎన్‌ఎంలు, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

### వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

**సఖినేటిపల్లి:** తమ న్యాయమైన కోర్కెల సాధనకై ఈ నెల 25న విజయవాడలో చేపట్టనున్న సత్యాగ్రహ దీక్షకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను మండల సమగ్ర శిక్షా కాంట్రాక్టు ఉద్యోగులు శుక్రవారం ఆవిష్కరించారు. స్థానిక మండల విద్యాశాఖాధికారి కార్యాలయం వద్ద ఈ ఆవిష్కరణలో ఉద్యోగులు బి.రాజబాబు, సాగర్, కిషోర్, శాంతి, దివ్య, సంధ్య, రత్నరాజు, లక్ష్మీబాయి, ప్రశాంత్ పాల్గొన్నారు. పన్నెండేళ్లుగా పనిచేస్తున్న తమకు పీఆర్సీ అమలు, ఉద్యోగ భద్రత కల్పన, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని వారు కోరారు.

### స్టడీ మెటీరియల్ పంపిణీ

**అయినవిల్లి:** మండలంలోని విలస జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు చేతుల మీదుగా శుక్రవారం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. హెచ్‌ఎం పీవీఆర్ ప్రసాద్ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. పదో తరగతి విద్యార్థులకు నడింపల్లి వెంకట సత్య తేజ వర్మ ఆర్థికసాయంతో స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కుసుమ లిల్లీమంగేష్కర్ పాల్గొన్నారు.

### 'ఓజోన్'ను కాపాడుకోవాలి

**కొత్తపేట:** కాలుష్య నియంత్రణ ద్వారా ఓజోన్ పొరను కాపాడుకోవాలని జనవిజ్ఞాన వేదిక (జేవీవీ) జిల్లా శాస్త్ర సాంకేతిక విభాగం కన్వీనర్, జిల్లా రిసోర్స్‌పర్సన్ డాక్టర్ బి.రాంప్రసాద్ అన్నారు. జేవీవీ పిలుపు మేరకు ఈ నెల 16 నుంచి 22 వరకూ విద్యా సంస్థల్లో ఓజోన్‌పై అవగాహన కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం స్థానిక ప్రియదర్శిని బాలవిహార్‌లో సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు జేవీవీ జిల్లా ఉపాధ్యక్షు డు జె.సత్యనారాయన అధ్యక్షత వహించగా రాంప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడు తూ కాలుష్యంపై ఓజోన్ రక్షణ దిశగా అందరూ అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ముందుగా ఓజోన్ పొరను కనుగొన్న శాస్త్రవేత్తలు చార్లెస్ ఫాబ్రి, హెన్నీ బూసన్‌లకు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సదస్సులో జేవీవీ జిల్లా కార్యదర్శి కేవీ రమణ, ప్రియదర్శినీ కరస్పాండెంట్ ఏబీసీ దేవ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# చురుగ్గా జగనన్న సురక్ష సర్వే

- క్లస్టర్ పరిధిలో సుమారు 2.68 లక్షల కుటుంబాలు
- 237 శిబిరాల నిర్వహణకు చర్యలు
- ముందస్తుగా ఇంటింటా వివరాలు సేకరణ



మాచవరంలో టోకెన్‌లు అందిస్తున్న ఎంపీపీ వెంకటేశ్వరరావు, వైద్య సిబ్బంది

**కొత్తపేట:** ప్రతి కుటుంబం సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలన్నదే లక్ష్యంగా ఉద్దేశించిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' ఇంటింటా సర్వే చురుగ్గా సాగుతుంది. ఈ నెల 30 నుంచి ప్రతి మండలంలో గ్రామ సచివాలయాల వారీగా ఈ కార్యక్రమం కింద ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించేందుకు షెడ్యూల్ నిర్ణయించారు. దానికి ముందుగా ఈ నెల 15 నుంచి వలంటీర్లు, పీహెచ్‌సీల వైద్య సిబ్బంది ఇంటింటా సర్వే జరిపి వివిధ అనారోగ్య రుగ్మతలతో బాధపడుతున్న రోగులను గుర్తించే కార్యక్రమం చేపట్టారు. గుర్తించిన రోగులకు 30 నుంచి నిర్వహించే వైద్య శిబిరాల్లో వైద్య నిపుణులతో వ్యాధిగ్రస్తులకు వైద్య సేవలు అందించనున్నారు. ఇప్పటికే ఫ్యామిలీ డాక్టర్ కింద పీహెచ్‌సీల వైద్యులు, సిబ్బంది గ్రామాలకు వెళ్లి వైద్య సేవలందించడంతో పాటు దీర్ఘకాలిక రోగులు, ఆరోగ్యశ్రీ పథకంలో శస్త్ర చికిత్సలు చేయించుకున్న వారి వద్దకు వెళ్లి వైద్య సేవలందిస్తున్న విషయం తెలిసిందే. ఇదిలా జరుగుతుండగా రాష్ట్ర ప్రభుత్వం మరో బృహత్తర కార్యక్రమంగా జగనన్న ఆరోగ్య సురక్ష పేరుతో స్పెషలిస్టు వైద్యులను గ్రామాలకు పంపిస్తుంది. అయితే ముందుగా ప్రతి కుటుంబంలో అనారోగ్య బాధితులను గుర్తించేందుకు సర్వే చేపట్టారు. ఆ విధంగా ఈ నెల 30 నుంచి నిర్వహించే గ్రామాల్లో సర్వే బృందాలు ఆరోగ్య సర్వే ప్రారంభించారు. ఆ విధంగా కొత్తపేట, పి.గన్నవరం, రాజోలు నియోజకవర్గాల్లోని 11 మండలాల్లో సర్వే విస్తృతంగా సాగుతుంది. ఆయా నియోజకవర్గాల్లో సుమారు 2.68 లక్షల కుటుంబాలు కాగా ఇప్పటికే సుమారు 45 వేల కుటుంబాల సర్వే పూర్తయింది. ఈ కార్యక్రమం ఈ నెల 29 వరకూ కొనసాగుతుంది. 237 వైద్య శిబిరాల నిర్వహణకు చర్యలు తీసుకున్నారు. ఇటీవల ప్రజల అవసరాలు ముఖ్యంగా వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా ధ్రువీకరణ పత్రాలు ఉచితంగా సమకూర్చేందుకు జగనన్న సురక్ష పేరుతో సచివాలయాల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహించిన మాదిరిగా ఈ ఆరోగ్య సురక్ష క్యాంపులను కూడా తహసీల్దార్, ఎంపీడీఓల ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. ఆ మేరకు బృందాలను నియమించారు. మండలంలో రోజుకు ఒక సచివాలయం పరిధిలో వైద్య శిబిరం నిర్వహిస్తారు. మండలంలో ఇద్దరు వైద్యులతో పాటు మరో ఇద్దరు వైద్య నిపుణులు వైద్య సేవలందిస్తారు. ఈ క్యాంపులో అవసరమైన పరీక్షలు నిర్వహిస్తారు. వ్యాధిని బట్టి మందులు ఇస్తారు. శస్త్ర చికిత్సలు, మెరుగైన వైద్యం అవసరమైతే సమీపంలోని ప్రభుత్వాసుపత్రి, ఆరోగ్యశ్రీ ఆస్పత్రులకు తరలిస్తారు.

**ప్రజల ఆరోగ్య సంరక్షణే లక్ష్యం**

**అంబాజీపేట:** రాష్ట్రంలో ప్రతి ఒక్కరి ఆరోగ్య సంరక్షణ ధ్యేయంగా సీఎం జగనన్న ఆరోగ్య సురక్ష ప్రారంభించారని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. మాచవరం సచివాయలం–4లో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని శుక్రవారం ఎంపీపీ పరిశీలించారు. ఎంపీపీ మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా మెరుగైన వైద్య సేవలు అందుతాయన్నారు. రోగులకు ఏమైన సమస్యలుంటే వాటిని యాప్‌లో నమోదు చేసి టోకెన్ ఇస్తారన్నారు. ఈ నెల 30న అంబాజీపేటలో నిర్వహించే మోగా వైద్య శిబిరంలో అన్ని రకాల రోగాలకు ప్రత్యేక వైద్య నిపుణులు వస్తారన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ బి.అప్పారావు, పీహెచ్‌ఎన్ కె.రత్నకుమారి, వైఎస్సార్‌సీపీ నాయకులు, ఏఎన్‌ఎంలు, ఆశాలు, వలంటీర్లు పాల్గొన్నారు.

### అనారోగ్య బాధితులను గుర్తిస్తున్నాం



రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మంగా అమలు చేస్తున్న 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమానికి సంబంధించి గ్రామాల్లో ఇంటింటా సర్వే చురుగ్గా సాగుతోంది. డివిజన్‌లో పీహెచ్‌సీల సిబ్బంది ఇంటింటికీ వెళ్లి అనారోగ్య రుగ్మతలతో బాధపడుతున్న వారిని గుర్తిస్తున్నారు. అవసరమైన మందులు ఇవ్వడంతో పాటు వారికి ఒక టోకెన్ ఇచ్చి ఈ నెల 30 నుంచి ప్రారంభమయ్యే వైద్య శిబిరాలకు సిఫారసు చేస్తున్నారు. సచివాలయాల పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

– ఎం.ప్రభాకరరావు, డీఎల్‌డీఓ, కొత్తపేట

### మొసలి సంచారంతో అప్రమత్తంగా ఉండాలి



అధికారులను ఫోన్‌లో అప్రమత్తం చేస్తున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

**ఆత్రేయపురం:** మండలంలోని బొబ్బర్లంక హెడ్ స్లూయిస్ ద్వారా ప్రధాన పంట కాలువలోకి మొసలి ప్రవేశించడంపై అధికారులను ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అప్రమత్తం చేశారు. గణపతి నవరాత్రుల దృష్ట్యా వినాయక నిమజ్జనాలు జరిగే ప్రధాన పంట కాలువలోకి మొసలి ప్రవేశించిన విషయం తెలిసిన వెంటనే అధికారులకు ఫోన్ చేసి అప్రమత్తం చేశారు. పోలీస్, మత్స్య, ఫారెస్టు అధికారులతో పాటు పలువురిని అప్రమత్తం చేశారు. రైతులు, వినాయక నిమజ్జనం చేసే భక్తులకు మొసలి వల్ల ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని, పట్టుకునే అవకాశాలను పరిశీలించి అమలు చేయాలని అధికారులకు ఆదేశించారు. వినాయక నిమజ్జనాల సమయంలో అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. చిన్నపిల్లలు నిమజ్జనంలో పాల్గొంటే వారి పట్ల పెద్దలు అప్రమత్తంగా ఉండాలన్నారు. భక్తులంతా వినాయక నిమజ్జనంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలన్నారు.

### మహిళలు ఆర్థికంగా పురోభివృద్ధి సాధించాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాబార్డు ఏజీఎం సోమునాయుడు

**మామిడికుదురు:** మహిళలు ఆర్థికంగా, పారిశ్రామిక వేత్తలుగా పురోభివృద్ధి సాధించాలని నాబార్డు ఏజీఎం వై.సోమునాయుడు సూచించారు. నాబార్డు సహకారంతో ఆక్సిజన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎల్‌ఈడీపీ ప్రోగ్రామ్‌లో భాగంగా పాశర్లపూడి బాడవలో ఏర్పాటు చేసిన మహిళల ఉచిత శిక్షణ కార్యక్రమం శుక్రవారం ప్రారంభమైంది. అసోసియేషన్ అధ్యక్షుడు కటికిరెడ్డి గంగాధరం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నాబార్డు ఏజీఎం సోమునాయుడు మాట్లాడుతూ 90 మంది మహిళలకు 15 రోజుల పాటు ఉచితంగా శిక్షణ ఇస్తామన్నారు. ఈదరాడ, పాశర్లపూడి, జనుపల్లి గ్రామాల్లో ఈ శిక్షణ జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. డీఆర్‌డీఏ పీడీ శివశంకర్‌ప్రసాద్ మాట్లాడుతూ శిక్షణ పొందిన వారికి నూతనంగా యూనిట్లు ఏర్పాటు చేసుకునేందుకు ప్రభుత్వం అన్ని సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. కార్యక్రమంలో నాబార్డ్ క్షేత్రస్థాయి అధికారులు పాల్గొన్నారు.

### భారీ వర్షానికి అధ్వానంగా రోడ్లు



అధ్వానంగా మారిన బి.దొడ్డవరం రోడ్డు

**మామిడికుదురు:** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో రెండు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షానికి మండలంలోని పలు రోడ్లు అధ్వానంగా మారాయి. రోడ్లపై పెద్ద పెద్ద గోతులు ఏర్పడి ఈ గోతుల్లో భారీగా వర్షం నీరు నిలిచిపోయింది. పాశర్లపూడి కైకాలపేట నుంచి పాశర్లపూడి బాడవ వరకు 216వ నంబర్ జాతీయ రహదారి పూర్తిగా దెబ్బతింది. ఈ రోడ్డు పూర్తిగా పాడైపోయి గ్రామీణ ప్రాంతానికి చెందిన రోడ్డును తలపిస్తోంది. గోతులతో అధ్వానంగా మారిన ఈ రోడ్డుపై ప్రయాణికులు తీవ్ర ఇబ్బందుల నడుమ ప్రయాణం సాగిస్తున్నారు. మామిడికుదురు, నగరం గ్రామాల్లో సైతం జాతీయ రహదారిపై ముంపునీరు నిలిచిపోయింది. దీంతో వాహనదారులకు అవస్థలు తప్పడం లేదు. వీటితో పాటు మండలంలోని గోగన్నమఠం, కరవాక, మగటపల్లి, ఈదరాడ, కొమరాడ, మాకనపాలెం, ఆదుర్రు తదితర గ్రామాల్లో రోడ్లపై ముంపునీరు నిలిచిపోయి ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. మరో రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికలు ప్రజల్ని ఆందోళనకు గురి చేస్తున్నాయి.

## ప్రజారోగ్య పరిరక్షణకు ప్రభుత్వం కృషి



ముంగండలో జగనన్న సురక్ష సర్వేను పరిశీలిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ దుర్గారావుదొర

**పి.గన్నవరం:** ప్రజారోగ్య పరిరక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి ఎం.దుర్గారావు దొర అన్నారు. ×జగనన్న ఆరోగ్య సురక్ష₹లో భాగంగా మండలంలోని ముంగండ–1 గ్రామ సచివాలయ పరిధిలో శుక్రవారం జరిగిన ఇంటింటి సర్వేను ఆయన పరిశీలించారు. వైద్య సిబ్బందికి పలు సూచనలిచ్చారు. ప్రజలకు ఆరోగ్య పరీక్షలను వారి ఇంటి వద్దే నిర్వహించాలని అన్నారు. ఇతర వైద్య సేవల కోసం గ్రామాల్లో నిర్దేశించిన తేదీల్లో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి తీసుకురావాలని సూచించారు. సర్వే, ఆరోగ్య పరీక్షల వివరాలను యాప్‌లో నమోదు చేయాలన్నారు. నాగుల్లంక పీహెచ్‌సీ వైద్యాధికారి కె.సుబ్బరాజు, ఎంపీహెచ్‌ఈలు రాయుడు రామకృష్ణమూర్తి, ఎస్.శ్రీనివాసరెడ్డి, ఎంపీహెచ్ సీహెచ్ మరియమ్మ ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

**మామిడికుదురులో..**

**మామిడికుదురు:** జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు అడబాల తాతకాపు పేర్కొన్నారు. లూటుకుర్రులో శుక్రవారం సురక్ష సర్వేను ఆయన ప్రారంభించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి స్పందన మాట్లాడుతూ సర్వేలో భాగంగా వైద్యారోగ్య శాఖ ఉద్యోగులు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ఆరోగ్య పరీక్షలు చేస్తారన్నారు. వ్యాధులు ఉన్న వారిని గుర్తించి వారికి కూపన్లు అందించి గ్రామంలో వచ్చే నెల 9న లూటుకుర్రు జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో జరిగే మెగా వైద్య శిబిరంలో వైద్యం అందిస్తామన్నారు. వ్యాధులు ఉన్న వారికి సర్పంచ్ తాతకాపు టోకెన్లు అందించారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ డీవీ ప్రసాద్, ఎంపీహెచ్‌ఎస్ రాజేంద్ర, ఎంపీహెచ్‌ఎఫ్ బి.సంపూర్ణ, ఎంపీహెచ్‌పీ, ఏఎన్‌ఎం, ఆశ కార్యకర్తలు, వలంటీర్లు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేకు నాయీ బ్రాహ్మణుల సన్మానం



ఎమ్మెల్యే చిట్టిబాబును సత్కరిస్తున్న కల్యాణ కట్ట నాయీ బ్రాహ్మణులు

**మామిడికుదురు:** అప్పనపల్లి బాలబాలాజీ దేవస్థానం కల్యాణకట్ట నాయీ బ్రాహ్మణ సేవా సంఘం ప్రతినిధులు ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబును నగరంలో అతని స్వగృహం వద్ద శుక్రవారం సన్మానించారు. ప్రభుత్వ జీవో 110కి అనుగుణంగా 24 మందికి కనీస కమిషన్ హామీని అమలు చేశారు. నెలకు ఒక్కొక్కరికి రూ.20 వేల వంతున వేతనం చెల్లించేందుకు ఎమ్మెల్యే కృషి చేశారని పేర్కొన్నారు. తమ డిమాండ్ల పరిష్కారం కోసం కృషి చేసిన సందర్భంగా ఎమ్మెల్యే చిట్టిబాబుకు పూలమాల వేసి, శాలువాతో ఘనంగా సన్మానించారు. కల్యాణ కట్టలో పని చేస్తున్న వారిలో 24 మందిని అర్హులుగా దేవాదాయశాఖ ఉద్యోగులు గుర్తించి జీవో అమలు చేశారని ఈ సందర్భంగా సేవా సంఘం ప్రతినిధులు గుర్తు చేశారు. అప్పనపల్లి సర్పంచ్ గెడ్డం మంగాలక్ష్మితో పాటు పాలక వర్గ సభ్యులు తమకు సహకారం అందించి, ప్రభుత్వ జీవోను అమలు చేసే విధంగా కృషి చేశారన్నారు.

## ప్రభుత్వ ఆస్తులకు రక్షణగా ఎస్‌పీఎఫ్



పాదలాడలో నిర్వహించిన దర్బార్‌లో పాల్గొన్న ఎస్‌పీఎఫ్ కమాండెంట్ నరసింహారావు

**రాజోలు:** ప్రభుత్వ ఆస్తులకు ఎస్‌పీఎఫ్ రక్షణగా నిలుస్తుందని (స్పెషల్ ప్రొటక్షన్ ఫోర్స్) ఎస్‌పీఎఫ్ రాజమహేంద్రవరం కమాండెంట్ డాక్టర్ కొండా నరసింహారావు అన్నారు. శుక్రవారం ఆయన పాదలాడ శుభం గ్రాండ్‌లో నిర్వహించిన ఎస్‌పీఎఫ్ దర్బార్‌కు ముఖ్యఅతిథిగా విచ్చేశారు. దర్బార్‌కు విచ్చేసిన ఆయనకు పోలీసు గౌరవ వందనంతో స్వాగతం పలికారు. ఎస్‌పీఎఫ్ విధులు, బాధ్యతలపై ఆయన అవగాహన కల్పించారు. కోనసీమ ప్రాంతంలో ఓఎన్జీసీ చేపడుతున్న కార్యకలాపాలకు ఎస్‌పీఎఫ్ రక్షణగా నిలుస్తుందన్నారు. ఓఎన్జీసీ బావులను, పైప్‌లైన్ రక్షణ కోసం నిరంతరం పహారా కాస్తున్నారన్నారు. సచివాలయం, అసెంబ్లీ, హైకోర్టు, ఎయిర్ పోర్టులు, బ్యాంకులు, నగదు భద్రత, విద్యుత్ ప్రాజెక్టులు, తిరుమల తిరుపతి, శ్రీశైలం, అన్నవరం, సింహాచలం వంటి పుణ్యక్షేత్రాలు, విద్యుత్ ప్రాజెక్టులు, డ్యామ్‌లు, ప్రముఖుల నివాసాలకు ఎస్‌పీఎఫ్ రక్షణగా నిలుస్తుందన్నారు. అసిస్టెంట్ కమాండెంట్ ఒ.కృష్ణయ్య, ఇన్‌స్పెక్టర్ ఎస్.సత్యనారాయణ, ఎస్సైలు బి.రమేష్, ఆర్.ఆదినారాయణ, పి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## వినాయకునికి ప్రత్యేక పూజలు



అంబాజీపేటలో విభూది గణపతి

**ఆలమూరు:** గణపతి నవరాత్ర వేడుకలను పురస్కరించుకుని మండలంలోని వివిధ గ్రామాల్లోని ఆలయాలు, మండపాలు ఐదో రోజైన శుక్రవారం భక్తులతో కిటకిటలాడాయి. మండలంలోని ఆయా గ్రామాల్లోని కూడళ్లు, వీధుల్లో గణనాథుడ్ని ప్రతిష్ఠించిన భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఆలమూరు, చెముడులంక, పెనికేరు, పినపళ్ల, సంధిపూడి, చింతలూరు, నర్సిపూడి, చొప్పెల్ల తదితర గ్రామాల్లోని వినాయకుని ఆలయాలు, మంటపాల వద్ద ఏర్పాటు చేసిన చలువ పందిళ్ల వద్ద నిర్వాహకులు భజన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. గణపతి ఆలయాల వద్ద నిర్వాహకులు ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించి తమ భక్తిని చాటుకున్నారు.

**విభూది అలంకరణలో..**

**అంబాజీపేట:** స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద వేంచేసిన శ్రీలక్ష్మీ గణపతి ఆలయంలో ఉన్న వినాయకుడు విభూది అలంకారణతో శుక్రవారం భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు మర్ల వెంకటశ్రీనివాస శర్మ గణపతి నవరాత్రుల సందర్భంగా వినాయకుడిని విభూదితో అలంకరించారు. కొర్లపాటివారి పాలెంలో నెలకొల్పిన గణపతి నవరాత్రుల పందిరి వద్ద భారీ అన్నసమారాధన చేపట్టారు. కె.పెదపూడి, పుల్లేటికుర్రు, గంగలకుర్రు మలుపు, జి.అగ్రహారం, తొండవరం, ఇసుకపూడి తదితర ప్రాంతాల్లో గణపతి పందిళ్లలో ప్రత్యేక పూజలు చేశారు.

**ఆకట్టుకుంటున్న మట్టి వినాయకుడు**

**రాజోలు:** పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వామి కావాలని చాటి చెప్పేందుకు పొదలాడలో ఏర్పాటు చేసిన మట్టి వినాయకుడి విగ్రహం ఆకట్టుకుంటుంది. స్థానిక యువరత్న, ఎన్టీఆర్ సేవా సమితి, గణపతి యువజన సంఘం సంయుక్తంగా నాలుగు అడుగుల మట్టి వినాయకుడిని తయారు చేసి రంగులు వేశారు. వినాయకుడి చేతిలో 15 కేజీల లడ్డూను ఏర్పాటు చేసి నిత్య పూజలు చేస్తున్నారు. వినాయకుడి విగ్రహాలను ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసి వివిధ రసాయన రంగులను వినియోగించడం పర్యావరణానికి హానికరమన్నారు.

## జిల్లాస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



జిల్లా స్థాయి క్రీడలకు ఎంపికైన ఈతకోట హైస్కూల్ విద్యార్థులతో పీఈటీ రామకృష్ణ

**రావులపాలెం:** ఇటీవల నియోజకవర్గ స్థాయిలో జరిగిన స్కూల్ గేమ్స్ స్పోర్ట్స్‌లో మండలంలోని ఈతకోట హైస్కూల్‌కు చెందిన పలువురు విద్యార్థులు పాల్గొని ప్రతిభ చూపడంతో జిల్లా స్థాయికి ఎంపికైనట్లు పీఈటీ రామకృష్ణ శుక్రవారం తెలిపారు. అండర్–17 బాలికల, బాలుర విభాగాల్లో సీహెచ్ లక్ష్మీ సాయిశ్రీ జావెలిన్, వంద మీటర్లు, 400 మీటర్ల పరుగు, పోల్‌వాల్ట్‌లో ద్వితీయ స్థానం, కె.మీనా అమృత సత్య డిస్కస్‌త్రో, షాట్‌పుట్, హేమర్ త్రోలలో ప్రథమ స్థానం, యు.మీనాక్షి హేమర్ త్రోలో ద్వితీయ స్థానం, బి.హిమశ్రీలక్ష్మి పోల్‌వాల్ట్‌లో ప్రథమ స్థానం, కె.యక్షిత 400 మీటర్ల పరుగులో ప్రథమం, 100 మీటర్ల పరుగులో ద్వితీయ స్థానం సాధించారన్నారు. అలాగే బాలుర విభాగంలో కెఎల్‌డీఎస్ చక్రధర భూషణం 100, 400 మీటర్ల పరుగులో ద్వితీయ స్థానం, ఎం.గణేష్ మణికంఠ పోల్ వాల్ట్‌లో ప్రథమ స్థానం, జావెలిన్‌లో ద్వితీయ స్థానం, ఎం.సత్యప్రకాష్ పోల్‌వాల్ట్‌లో ద్వితీయ స్థానం సాధించి జిల్లాకు ఎంపికయ్యారన్నారు. అలాగే అండర్–14 బాలికల, బాలుర విభాగంలో సీహెచ్ మోక్షిత అనుశ్రీ 800 మీటర్ల పరుగులో మొదటి స్థానం, వై.లావణ్య డిస్కస్‌త్రోలో ప్రథమస్థానం, 800 మీటర్ల పరుగులో ద్వితీయ స్థానం, కె.ప్రిన్సిజ్వాలా షాట్‌పుట్‌లో ద్వితీయ స్థానం, 400 మీటర్ల రిలే పరుగులో సీహెచ్ మోక్షిత అనుశ్రీ, జి.గంగాభవాని, జి.రేణుకాదేవి, ఎం.పూర్ణ ఈశ్వరిలు ద్వితీయ స్థానం సాధించారన్నారు. బాలుర విభాగంలో సీహెచ్ నాగ సాయి ప్రణీత్ కుమార్ 800 మీటర్ల పరుగులో ద్వితీయ స్థానం సాధించి జిల్లాకు ఎంపికైనట్లు హెచ్‌ఎం కేఎస్‌వీ కృష్ణారెడ్డి తెలిపారు.

## 'రైతు నేస్తం'తో ఎకరానికి రూ.8 లక్షల రుణం



మామిడికుదురు మహాజన సభలో మాట్లాడుతున్న చైర్మన్ ఆదిత్యకుమార్

**మామిడికుదురు:** రైతు నేస్తం పథకం ద్వారా ఎకరానికి రూ.8 లక్షల రుణం అందిస్తున్నామని మామిడికుదురు పీఏసీఎస్ చైర్మన్ కటకంశెట్టి ఆదిత్యకుమార్ పేర్కొన్నారు. సొసైటీ మహాజన సభ ఆదిత్యకుమార్ అధ్యక్షతన శుక్రవారం మామిడికుదురు కార్యాలయంలో జరిగింది. రైతుకు ఎన్ని ఎకరాలు ఉంటే అన్ని ఎకరాలకు ఎకరానికి రూ.8 లక్షలు వంతున రుణం అందిస్తామన్నారు. దీనిపై 12 శాతం వడ్డీ చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. రైతులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సొసైటీలో 2265 మంది రైతులు సభ్యులుగా ఉన్నారని పేర్కొన్నారు. స్వల్పకాలిక రుణాలుగా 631 మందికి రూ.3.67 కోట్లు, దీర్ఘకాలిక రుణాలుగా 67 మందికి రూ.1.14 కోట్లు, మధ్య కాలిక రుణాలుగా 68 మందికి రూ.1.71 కోట్లు అందించామన్నారు. రైతుల నుంచి రూ.1.16 లక్షలు డిపాజిట్లుగా సేకరించామని, బంగారం తాకట్టుపై 72 మందికి రూ.62 లక్షలు రుణాలుగా ఇచ్చామని ఆదిత్యకుమార్ తెలిపారు. సమావేశంలో సభ్యులు కాండ్రేగుల శ్రీనివాసరావు, కొల్లాబత్తుల మధువాసన్, సీఈఓ ఆర్‌కే రెడ్డి, డీసీసీబీ బ్రాంచ్ మేనేజర్ ఎంహెచ్ అబ్బాస్, మాజీ సర్పంచ్ నయినాల సత్యనారాయణ, రైతులు పినిశెట్టి నాగబాబు, కంచి శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

## సంపూర్ణ పారిశుధ్య చర్యలు

**ఆలమూరు:** గ్రామీణ ప్రాంతాల్లో సంపూర్ణ పారిశుధ్యం నెలకొల్పేందు వీలుగా ప్రతి శుక్రవారాన్ని పొడి వారం (డ్రైడే)గా పాటించి సంపూర్ణ పారిశుధ్యం నెలకొల్పాలని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు డి.మల్లికార్జున, పి.భవానీశంకర్ కోరారు. ఫ్రైడే సందర్భంగా ఆయా గ్రామాల్లోని ఆరోగ్య, ఆశ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఇంట్లో నిల్వ నీరు ఉండకుండా తీసుకోవలసిన చర్యలను వివరించారు. రుబ్బురోళ్లు, కొబ్బరి చిప్పలు, ఖాళీ సీసాలు, వ్యర్థాలను ఇంట్లో ఉండకుండా చూడాలని మహిళలకు సూచించారు. దీని వల్ల క్రిమి, కీటకాలు దరి చేరవని, తద్వారా అంటు వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉండదన్నారు. వివిధ గ్రామాల్లో ఆరోగ్య, ఆశ సిబ్బంది ఫ్రైడేను వివరిస్తూ భారీ ర్యాలీలు నిర్వహించారు. సీహెచ్‌ఓ పి.రాధాకృష్ణ, హెల్త్ ఎడ్యుకేటర్ ఏవీవీ రాజా, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, ఎన్.వెంకటేశ్వరరావు, పి.ఉమ, సీహెచ్ బేబి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## ఉద్యమంలా సామూహిక ఎలుకల నిర్మూలన

- రైతులకు బ్రోమోడయోలిన్ మందు పంపిణీ
- మందు తయారీపై శిక్షణ



పెదపళ్లలో ఎలుకల నివారణ మందు మిశ్రమాన్ని తయారు చేస్తున్న సిబ్బంది

**రాజోలు/సఖినేటిపల్లి/ఆత్రేయపురం/కొత్తపేట/రావులపాలెం/ఆలమూరు/మలికిపురం:** రైతుల పంటలను తీవ్రంగా నష్టపరిచే ఎలుకలను సామూహికంగా నిర్మూలన చేయాలని మండల వ్యవసాయాధికారి వై.మధుకుమార్ వివరించారు. శుక్రవారం మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రా(ఆర్బీకే)ల పరిధిలో ఎలుకల నిర్మూలన చేసేందుకు ఉచితంగా నూకలతో తయారు చేసిన మందును పంపిణీ చేశారు. ఇరవై ఐదు కేజీల నూకలను అర కేజీ వంటనూనెతో బాగా కలిపి దానిలో 500 గ్రాముల బ్రోమోడియోలిన్ మందును కలపాలి. అలా తయారు చేసుకున్న ఎరను ఎలుకలు సంచరించే బొరియల వద్ద ఉంచితే విషపు ఎరను ఎలుకలు తిని చనిపోతాయన్నారు. సఖినేటిపల్లి మండలంలో శుక్రవారం వరి సాగుచేసిన ఏరియాల్లో సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం ఏవో పీవీ నరసింహారావు ఆధ్వర్యాన ఆ శాఖ సిబ్బంది నిర్వహించారు. కాగా సామూహిక ఎలుకలు నిర్మూలనలో భాగంగా రైతులకు ఉచితంగా సిద్ధం చేసిన విషపు ఎర మిశ్రమాన్ని వీఏఏ, వీహెచ్ఏ, ఏఈవోలు పంపిణీ చేశారు. దీనిని శృంగవరప్పాడులో మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఇంజేటి శామ్యూల్‌రాజు పంపిణీని చేశారు. ఆత్రేయపురం మండలంలోని మెర్లపాలెంలో సామూహిక ఎలుకల నివారణలో ఆయన పాల్గొని రైతులకు పలు సూచనలు ఇచ్చారు. కొత్తపేట మండలంలో స్థానిక వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో ఏడీఏ ఎం.వెంకటరామారావు పర్యవేక్షణలో ఈ సామూహిక కార్యక్రమం చేపట్టారు. దానిలో భాగంగా మండల వ్యవసాయ అధికారి (ఏఓ) పద్మలత ఆధ్వర్యంలో మండలంలోని 10 గ్రామాల్లో వీఏఏలు, వీహెచ్ఏలు రైతులకు సామూహిక ఎలుకల నిర్మూలనపై అవగాహన కల్పించారు. రావులపాలెం మండలంలోని గోపాలపురం, పొడగట్లపల్లి, ఈతకోట, రావులపాడుల్లో కార్యక్రమాల్లో మండల వ్యవసాయాధికారి బి.మీనా పాల్గొని ఎలుకల మందు తయారు చేసే విధానాన్ని వివరించి రైతులకు అందజేశారు. ఆలమూరు మండలంలోని వివిధ గ్రామాల సచివాలయాల వద్ద శుక్రవారం ఎలుకల నివారణ మందు బ్రోమోడయోలిన్ పంపిణీ జరిగింది. మలికిపురం మండలంలో ఏవో ఎస్.రాకేష్ ఆధ్వర్యాన ఆ శాఖ సిబ్బంది సామూహిక ఎలుకల నిర్మూలన, విషపు ఎర తయారీపై రైతులకు అవగాహన కల్పించారు.